# హితోపదేశం

రచన : కాకరపర్తి కృష్ణమూర్తి

ఏవైనా వాద ప్రతిపాదనలు జరుగుతూవుంటే ఆ విషయం కాస్సేపు జాగ్రత్తగా పరికించండి. ఎటువైపు గెలిచేలాగ మీకు తోస్తే అటువైపునుంచి అవతలపక్షంమీద మీరుకూడ నాలుగురాళ్లు విసరండి.

దెబ్బలాటల్లోకూడ ఇలాగేకాని ఒక్కటి మాత్రం: ఈ విషయం జాగ్రత్తగా ఆచరించాలి. లేకపోతే వీపు చెడిపోతుంది!

నలుగురు స్నేహితులు కలిసి వెళ్ళేటప్పుడు హోటలికి వెడదామని ఒక స్నేహితుడు ప్రతిపాదన తెచ్చాడనుకోండి. మీరు వెడదామనీ అనవద్దు. వెళ్ళొద్దని అనవద్దు. ముభావంగా ఊరుకోండి. నలుగురితోపాటు హోటలికి చేరండి. కాని టిఫిన్ తీసికొని లేచే వాళ్ళలో ఆఖరివాళ్ళుగా మాత్రం ఉండండి. వేడికాఫీ చల్లారపోసుకుంటున్నట్లు నటించండి. ఆలస్యం చెయ్యండి. ఈ లోపల ఎవరో ఒకరు బిల్లు చెల్లించకపోరు! అంతా అయ్యాక అయ్యరును తిట్టేవాళ్ళలో ప్రథములుగామాత్రం మీరుండండి.

ఇలాగే నలుగురితోకలిసి సినిమాకు వెడదామనుకోండి. అప్పుడైనా ముఖ్యసూత్రం ఒకటే. టిక్కట్లుకొనటం నువ్వా, నేనా అనే మీమాంసవచ్చే సమయానికి కొంచెంసేపు ఏపాటల పుస్తకం కొనటానికోనన్నట్లు మొహం చాటు చెయ్యండి. ఈలోపల ఎవడోఒకడు టిక్కట్లు కొనెయ్యకమానడు.

ఎంత చాకచక్యంగా ప్రవర్తించినా ఎప్పుడూ మనడబ్బు లివ్వకుంటే "పీనాశి" వాళ్ళంగా బయటపడుతాం. అందువల్ల మనం డబ్బుకూడ ఖర్చుచేసేవాళ్ళలాగ కనపడటానికి అంతమంది స్నేహితులు మనవెంటలేకుండా ఇద్దరు ఉన్నపుడు వాళ్ళని హోటలికి తీసికెళ్ళి ఏదో తెమ్మని చెప్పి, అది తినటం పూర్తిఅయ్యాక 'సర్వరు' వచ్చి "ఏం తెమ్మంటారుసార్" అని అడిగితే ప్రిపరేషన్నుని తిడుతూ "ఇక్కడికే డోకువచ్చింది. ఇంకాఏమిటి తెమ్మనేది? రెండరకప్పులు కాఫీ తీసికుర్రా" అని ఒక్క కసురుకసిరి ముక్తసరిగా ముగించి జోరుగా డబ్బులు జేబులోంచి తీసి వాడికి పారవైచి గుమ్మంలోనుంచి అడుగుపెడుతూ 'ఈ కాఫీ కూడ చాల చండాలం. ఈ మధ్యన కాఫీ పొడుంలో చింతగింజలుపొడి ఎక్కువగా కలుపుతున్నారురా' అని అరచూ కాఫీహోటలికి వెళ్ళకుండా ఉండటానికిగల కారణాన్ని మాటుపెట్టండి.

ఇంట్లో భార్య నగలు చేయించమని గోలపెడుతుందనుకోండి. ఈరోజుల్లో వాళ్ళను సంతోషం పెట్టడం చాలా తేలిక. "నిన్ను నవనాగరిక యువతిగా చెయ్యబోతూ వున్నాను" అని చెప్పి వెయ్యండి. ఈ రోజుల్లో అంతకంటే కావాలిసిందేముంది? పాపం అమాయకురాలు పొంగిపోతుంది. కుడిచేతికి నాలుగుజతల గాజులు చేయించండి. రెండోచేతికి చేయించాలని బాధ లేదు. ఒక పాతికరూపాయలు ఖర్చుచేశారంటే ఒక చక్కని రిష్టువాచీ! (యుద్ధానంతరం మాటే!) ఎడంచేతికి గాజులు చేయించాల్సిన బాధ అది తీర్చుతుంది. మెడలోకి ఒక సన్నని పెద్దగొలుసు చేయించండి. అంతే! ఆఖర్!! వాళ్ళకి ఒక జత చెప్పులుకొంటే చాలు!! చవకగా గౌరవాన్ని ప్రేమనీ కొనుక్కున్నవారవుతారు.

నలుగురిలో ఏదైనా కష్టంకలిగించేపని చేసినపుడు ఏపని మర్చినా ఏది మర్చిపోకపోయినా "సారీ" అనటం మర్చిపోకండి. నిజంగా అది మిమ్మల్ని అనేకవిధాల కాపాడుతుంది.

ఏదైనా ఊరువెళ్ళటానికి బస్ స్టాండ్ కి వచ్చి కారులో కూర్చుంటామనుకోండి ఎవరైనా ముష్టివాడు వచ్చి "బాబూ! ధర్మం చెయ్యండి-బాబూ!" అని అడిగితే అటూ ఇటూ సర్దుకొంటున్నట్లు నటించి "లేదుపోరా! ముందర కారుదొరక్క చస్తూంటే మధ్య నువ్వొంటిపో" అనండి పరధ్యానంగా నటిస్తూ. ఇంకా వాడు పట్టుకువదలకుండా "బాబూ! గుడ్డివాణ్ణి బాబూ!" అని అంటే "నీ గుడ్డితనానికికూడా నేనేంచేసేది? నీ ఖర్మం అట్లా వ్రాసిపెట్టి ఉంది" అని ఒక ఛీత్కారంచేసి కండక్టరు వైపుతిరిగి "ఏమయ్యా!. ముందుసీటు ఖాళీ ఏనా? ఎవరైనా ఉన్నారా?" అని అడగండి.

మరొక ముఖ్యవిషయం. బండీవాడు ఒక అరఫర్లాంగు దూరంకూడాలేని స్టేషనుదగ్గరకు బండీ కట్టినందుకు అర్ధరూపాయిదాకా అడుగుతూ వుంటాడనుకోండి. వాడిరోగం కుదర్చటానికి "అట్లాగే! ఇస్తా" నని సామాన్లన్ని రైల్లోకి చేరేయించి అన్నీ భద్రంగా అమర్చి, అటూఇటూ చూసి కాస్సేపు పదిరూపాయల నోటువుందికాని చిల్లరలేదనీ, అటూఇటూ చూసి రైలు కదలబోయేసమయానికి ఒక బేడా వాడిచేతిలో పడవెయ్యండి. వాడు ఏమి లబ్బోదిబ్బోలంటే మాత్రం ఏమిలాభం? రైలు కదిలిపోయె!

కాని అన్నిటికంటే ముఖ్యవిషయం. మళ్ళీ చాలరోజులుదాకా ఆఊరు రావటానికి అవసరం ఉండదని నమ్మకంఉంటే మాత్రమే ఆలాంటి పని చెయ్యండి. లేకపోతే నీచపు వెధవలు (మనంమాత్రం కాదు) తెగించి కోపంకొద్దీ ఎలాంటిపనినైనా చెయ్యొచ్చు.

(పరా:—ఇవి ఆచరణలో పెట్టటానికి ప్రయత్నించేవారు దీనికి కాపీరైటు ఉందని గ్రహించాలి.)




## శృంగారదేవత

యగు మదనుఁడు వసంతఋతువుగడచిన వెనుక యువతీ జనుల తల వెండ్రుకలలో చిరస్థాయి యగునని మహాకవి కాళిదాసు పలికెను. దేవతలను సైతము ముగ్ధులనుచేసి యాకర్షించు ఆ కేశసంపదను కేశవర్ధిని నుపయోగించి సర్వకాలములయందు మనోజ్ఞముగ వృద్ధిచేసికొనరాదా!

కేశవర్ధిని మీ కుంతలములకు ప్రకాశమును, ప్రకాశమునకుతగిన అందము, అందమునకు తగిన యౌవనము నిచ్చును. విశేషించి బాల్యమునుండియే కుదుళ్ళను గట్టిపరిచి రాలనీయక కాపాడును. కేశవర్ధిని తులలేని చక్కని పెన్నెరులను ఆనెరికురులు మీ కద్వితీయ సౌందర్యము నిచ్చును.

# కేశవర్ధిని

నేడే మీ కురులకు కేశవర్ధిని వాడుడు. మీ తలవెండ్రుకలను అందముగా పెంచి బలపరచును.

కేశవర్ధిని అ. 12. కేశవర్ధిని షాంపూ అ. 12.
ప్యాకింగు, పోస్టేజి అధికము.
వర్తకు లందరి వద్దను దొరకును లేక

## సౌత్ యిండియా కెమికల్స్,

ఆర్. ఎస్. పురం, కోయంబత్తూరు.